ఓంశ్రీసాయిరాం

దేహభ్రాంతిలేని మోహమింతయులేని
త్యాగనిరతులైన యోగవరులు
గురులు నాడు నేడు గురువులట్టివారె
సత్యమైన బాట సాయిమాట.

బ్రహ్మ సృష్టిచేయు బ్రహ్మాండమునెల్ల
విష్ణు దీని పెంచి వృద్ధిజేయు
పరమశివుడు ద్రుంచు పాపిష్టజీవుల
గురువు మూడు క్రియలు సలుపు నొకడె.

విద్యార్థులారా! విద్యాభిమానులారా! అధ్యాపకులారా!

ఉద్యోగములన్నింటికంటె అధ్యాపకుని ఉద్యోగము బాధ్యత కలది, పవిత్రమైనది. అధ్యాపకుడు సత్యమార్గము అవలంబింపకున్న విద్యార్థులు చెడిపోవుదురు. తద్వారా సమాజము చెడిపోవును. విద్యార్థుల జీవితము, భవిష్యత్తు గురువుల చేతిలో ఉండుటవలన గురువులు దాని పవిత్రతను గుర్తించి, బాధ్యతను గుర్తించి ఆచరణయందు ఆదర్శప్రాయముగా వారికి ఆనందమునందించుటకు పూనుకోవాలి. పిల్లల మనస్సులు పరిశుద్ధముగ, నిర్మలముగా ఉండును. మీ బోధలు వారి లేత మనస్సులపై హత్తుకొనిపోవుటవలన అధ్యాపకులు చక్కని అభ్యాసమును, ఆదర్శమును కలిగియుండుట అత్యవసరము. పిల్లలు మంచినిగాని, చెడునుగాని సులభముగా గుర్తిస్తారు. దానిని అనుసరించుటకు ప్రయత్నిస్తారు. కాన, గురువులు సదభ్యాసములు కలిగియుండుటవల్ల వారిని మంచి మార్గమున తీర్చిదిద్దవచ్చును. తిరిగి ఈ విద్యార్థుల ప్రభావమే 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అని గురువులపై ప్రసరింపబడును. ఒకానొక కాలమున విద్యార్థిచేతనే గురువులు సంస్కరింపబడతారు. విద్యార్థులయందు వారిని వారు తీర్చిదిద్దుకొనే శక్తిసామర్థ్యములు లేవు. తల్లిదండ్రులు, గురువులు వీరిని సంస్కరించటానికి కృషి సల్పాలి. లేత మనస్సులు, నిర్మలనిస్వార్థత గల విద్యార్థుల హృదయములపై ఎట్టి ప్రచారప్రబోధలు సల్పుదుమో అట్టి తలంపులే వస్తాయి. దీనికి చిన్న ఉదాహరణ. ఒకానొక సమయమున చిన్న వయస్సునందు తల్లి సహాయముతో ఒక బాలుడు డ్రామాకు వెళ్ళాడు. అది మాతృభక్తి కలిగిన (శ్రవణుడు) డ్రామా. ఆ దృశ్యము చూచినంతనే అతనియందు పితృభక్తి ఆవిష్కరించినది. నా జీవితము పితృభక్తియందు అంకితము చేయవలెనని నిశ్చయించుకొన్నాడు. తల్లితో మరొకసారి హరిశ్చంద్ర డ్రామాకు వెళ్ళాడు. ఆ దృశ్యము అతని హృదయమందు హత్తుకొని తన జీవితమును సత్యానికి అంకితము చేయవలెనని నిశ్చయించుకొన్నాడు. జీవితమంతా ఆవిధముగానే గడిపినాడు. అతనే 'మోహన్‌దాస్ కరంచంద్'. తన జీవితము అట్టి రెండు పవిత్ర మార్గములో ప్రవేశ పెట్టుటచే రెండు రెక్కలుగల పక్షివలె, రెండు చక్రములుగల రథమువలె, తన జీవితమును సులభముగా, ఆనందముగా సాగించి మహాత్మగాంధీ అయినాడు.

దురదృష్టవశాత్తు నేడు మన భారతదేశమున అట్టి పవిత్ర అవకాశములు లేకుండుటచే యువకులు అపమార్గము పట్టుచున్నారు. కావున, గురువులు పాఠములు బోధించుటయేగాక వారి చిత్తములు ఆధ్యాత్మిక, నైతిక, ధార్మిక మార్గములందు నిలుపుటకు ప్రయత్నించాలి. మహాత్ముల చరిత్రలు వారికి బోధించాలి. పిల్లల చిత్తములు లేత లతలవంటివి. వాటిని సరియైన మార్గమున అల్లింపజేసి వారి జీవితములను శోభాయమానముగా వికసింపజేయాలి. పెడమార్గమున పట్టిన రెమ్మలు, కొమ్మలు అను చెడుభావములను కత్తిరించి సరిచేయాలి. గురువు తన బోధనలందు స్వానుభవమున ఆచారప్రచారములు చక్కగా వారికి అందించాలి. పిల్లలకు చెప్పు ప్రతి వాక్యము గురువులు ఆచరణయందు నిరూపించాలి. నిజముగా ప్రచారప్రబోధలకంటే ఆచరణే ఆధారము. ఒకానొక సమయములో గాంధీని పెడమార్గం పట్టించే గురువు ఒకడు తయారైనాడు. గాంధీ పెడమార్గము పట్టక సత్యాన్ని చెప్పి, ఆచరించి గురువునకు ప్రబోధించినాడు. గురువు తన తప్పును తెలుసుకొని సత్యమార్గాన్ని అవలంబించాడు. తనలోని తప్పులను శిష్యునిచే చెప్పించుకొనరాదు. ఈనాడు యువకుల ప్రవర్తనలు మితిమీరినవి. అందుచే భవిష్యత్తు అంతయూ గురువుల మీద ఆధారపడి ఉన్నది. పిల్లలు గుండువంటివారు, గురువులు శిల్పులవంటివారు. గురువులు శిష్యులను ఏ రూపనామములుగా చేతురో అట్టి ఆకారమునే ధరింతురు. అట్టి గుణములే వచ్చును. కాన, పిల్లల భవిష్యత్తంతయూ తల్లిదండ్రులపైన, గురువులపైన ఆధారపడి ఉన్నది. కాన, గురువు బాధ్యతపై ఎంతయో లోకము ఆధారపడి ఉన్నది. ఎంతోమంది సద్గుణవంతులను లోకమునకందించినవారౌతారు. ఇది ఒక భగవత్సేవగా భావించి ఏవిధమైన ప్రలోభాలకు, విషయవాసనలకు లొంగక పిల్లలను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుటకు కంకణము కట్టుకోవాలి.

ఈనాడు అనేకమంది చదివి ఉద్యోగములు చేసే స్త్రీలు కలరు. ఆ ధనాదాయము కంటే సంసారమును, బిడ్డలను చూచుకొని

సరిచేసుకొనే ఆదాయము పెద్దది.

ఉద్యోగములు చేయనువిదిలందరు పోవ
గృహ కృత్యములుదీర్చు గృహిణులెవరు?
ఆల్మగలిరువురు ఆఫీసులకుబోవ
ఇంటి పనులుజేయు ఇంతులెవరు?
పర బాలురకు నేర్ప పాఠశాలలకేగ
తమ బాలురకు నేర్పు తల్లులెవరు?
పుస్తకాల్ చేబట్టి పురుషుల వలెబోవ
వంటయింటిని దిద్దు వనితలెవరు?
డబ్బు వలన కలుగు యిబ్బంది తీరిన
ఇంటిలోని కొరతలెంతయుండు
సుఖము చూడబోవ సున్నయేయుద్యోగ
పదవియందునున్న పడతికెపుడు.

కనుక, బిడ్డలను తీర్చిదిద్ది ఆదర్శవంతులుగా తయారుచేసే పనికి పూనుకోవాలి. పర బిడ్డలను నూరుమందిని తీర్చిదిద్దే కంటే మన బిడ్డలిద్దరిని తీర్చిదిద్దుకుంటే జీవితము సుఖవంతమౌతుంది. బయటి పిల్లలకు నీతులు బోధిస్తూ తన బిడ్డలను తీర్చిదిద్దలేకపోవటం హాస్యాస్పదము. గురువులు సమత్వము నేర్పుటకు ప్రయత్నించాలి. సాధ్యమైనంతవరకు తమ బిడ్డలకు ముందు మంచి నేర్పాలి. దుర్గుణములు వారియందు చేరకుండా సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస, పరోపకారము మొదలగు సద్గుణములను నేర్పాలి. మన బాలవికాస్‌నందు కేవలం నీతికథలు, భగద్గీతా పఠనము, స్తోత్రములను నేర్పుటతోనే సరికాదు. వానికి తోడు నిత్యజీవితములో ఆధారమైన పెద్దలయందు వినయ, భయ, విధేయత, విశ్వాసములు, పాపభీతి, దైవప్రీతి వారికి నేర్పవలెను. తమ గృహములందు తల్లిదండ్రుల ఆజ్ఞ శిరసావహించే ఉత్తమ పాఠము నేర్పాలి. కేవలము ఇంతమాత్రమునకే తృప్తికాదు. వీరికి ఆరోగ్య సంబంధమైన విషయాలు నేర్పాలి. అనారోగ్యము వల్ల తల్లదండ్రులకు ధనవ్యయమేగాక మనశ్శాంతి ఉండదు. వారికి బ్రహ్మముహూర్తమున లేచుట, దంతధావనముచేయుట, పరిశుభ్ర ఆహారము భుజించుట, మలిన ప్రదేశముల సంచరించకుండుట మొదలగునవి నేర్పవలెను. చిన్న పిల్లలను బ్రహ్మముహూర్తమున లేపి పనులు చేసుకొనుట నేర్పాలి. పూర్వకాలమున తమ బిడ్డలకు చక్కగా నేర్పేవారు.

కొక్కొరో కోయని కోడి కూయగనె
చక్కగా నిద్రమంచమునుండి లెమ్ము
పలుదోముకొని దేహ బాధ తీర్చుకొని
జలకమాడి దుస్తులు ధరించి చల్ది భుజించి
హితమైన వస్తువు ఎంతయు నమిలి
మితముగ భుజించిన మేలగు నీకు
బడికేగి శ్రద్ధగా పాఠాల్ నేర్చి
అణకువగల బాలుడని అనిపించుకొనుము
తేమలోనెప్పుడు తిరుగంగబోకు
మురికి గుంటలచెంత పోబోకుమెపుడు
పరుగుడు, చెడుగుడు, బంతులాటయును
సరైన వేళళ సలుపుచునుండు
పై రీతుల నీవు పరిగణింతువేని
ఆరోగ్య భాగ్యంబులనుభవించెదవు.

ఈవిమైన చక్కని ప్రబోధలు ఆనాడు తల్లిదండ్రులు బోధించేవారు. ఈనాడు 9 గంటలవరకు బెడ్‌రూములోనే ఉంటుంటే ఇంక వారేమి నేర్పగలరు? అసభ్య, అసహ్య దృశ్యములకు తీసుకొనిపోవటము, తినటము, త్రాగటము నేర్పటము – ఈవిధమైన అభ్యాసములు మన బాలవికాస్‌లో లేకుండా చూచుకోవాలి. ఇంతేకాకుండా అధిక ధనవ్యయము చేయకూడదని పిల్లలకు బోధించాలి. శ్రీమంతుల ఇండ్లలో ధనము అతిగా అందించుట వలన పిల్లలు తినరాని పదార్థములు తినుట, చూడరాని దృశ్యములు చూచుట,

మరియు దుష్ప్రవర్తనకు మూలకారణములు. దీనికి ధనమే కారణము. పిల్లలకు పది రూపాయలు అవసరమైన తొమ్మిది రూపాయలు ఇవ్వాలి. కాని, పది అవసరమైన ఇరవై యిస్తారు. ఈ ప్రేమ ప్రాణం తీస్తుంది. మిగిలిన పది రూపాయలు వారిని దురభ్యాసములకు లోనుగావిస్తుంది. మన ప్రేమను ప్రేమగా ఉంచుకొని వారికి అపాయము రాకుండా చూచుకోవాలి. ఈవిధముగా ఆదర్శవంతముగా తీర్చిదిద్దాలి. మన బాలవికాస్ గురువులు మరియొక విషయమును గమనించాలి. క్లాసులు జరిగేటంతవరకు వినయవిధేయతలతో సక్రమముగానే నిర్వహించవచ్చును. బయట వారు ఏవిధమైన ప్రవర్తనలో ఉంటున్నారని గమనించి తగిన బోధన చేయాలి. అప్పుడప్పుడు తల్లదండ్రులను చేర్చి, 'పేరెంట్స్ డే' అని పెట్టి వారి ప్రవర్తనలు కనుక్కోవాలి. జీవితము కేవలము విద్యయందు మాత్రమే రాణించదు. సత్యజీవిత ప్రవర్తనతో రాణిస్తుంది. కనుక, సైన్సు, లెక్కలు, జనరల్ నాలెడ్జితోబాటు ఆధ్యాత్మిత, నైతిక, ధార్మికతను చేర్చాలి. ఈవిధమైన చర్యలు చేపట్టినంత మాత్రమునకే అభివృద్ధి రాదు. అసభ్యమైన డ్రామా, సినిమా ప్రదర్శనలకు కూడా పంపుటకు పూనుకోకూడదు. ఆ దృశ్యములు లేతహృదయములందు హత్తుకొనిపోతాయి. సినిమాలే మంచివి కావు. అది అంతయూ అసత్యము. ఇట్టి ప్రదర్శనకు పంపుట మానండి. ఎందుకు సినిమాకు పోకూడదో చక్కగా వివరించి బోధించాలి. ఆ దృశ్యము సత్యము కాదు, శబ్దము సత్యము కాదు. గ్రామఫోను పలుకుతుందని వారికి నచ్చచెప్పాలి. అక్కడ నిజముగా చెప్పాలి. భ్రాంతిని చూచి మరచి, మురిసి, మైమరచిపోతున్నాము. అక్కడ ఏదైన వ్యక్తి మరణిస్తే అమితముగా ఏడ్చినట్లుగా అనిపిస్తుంది. నిజముగా వారు ఏడ్చుట కాదు. మరణించనూ లేదు. చూచిన పిల్లలు ఏడుస్తున్నారు. కనుక, ఇది అజ్ఞాన లక్షణము.

ఈనాడు మనము దుస్తులను కట్టు, బొట్టు, జుట్టు అన్నింటిని ఇమిటేషన్ చేస్తున్నాము. అవన్నియూ సినిమాలో సత్యములా? కాదు. కృత్రిమమైనవాటిని అనుభవించుచుండుట వలన, ఆనందించుట వలన మన జీవితముకూడా కృత్రిమముగా తయారౌతున్నది. వేషము, భాషలు, ప్రవర్తన అన్నియూ సినిమా భాషలుగా ఉంటున్నాయి. మనకున్న ప్రత్యక్ష సినిమా (జీవితము) మనం అనుభవించాలి. మన యువకత్వం, యౌవనత్వం ఎంత కాలముంటాయి?

అందము ప్రాయము ఇంద్రియశక్తియు
ఉందని నిక్కకురోరన్నా
ముందున్నదిరా తొందరలోనే
ముసలితనమ్మను ముసుళ్ళ పండుగ
బుఱ్ఱుమనుచు జీవుండను పిట్ట
బుట్టబొమ్మను విడిపోగా
బిఱ్ఱుగ నీల్గిన కఱ్ఱ బొమ్మ యిది
బఱ్ఱున బయటకి పట్టి లాగేరు

ఈ దేహమును.

ఇలాంటి జీవితమును సత్యమని, నిత్యమని భావించుట మానవత్వమునకు సరికాదు. నిత్య, సత్య, నిర్మల, పవిత్ర జీవితమునకు అంకితంగావించాలి. ఈనాటి చదువులు చెత్తచదువులు. ఇలాంటి చదువులకోసం మనము మానవత్వములో దైవత్వమనే రత్నాన్ని అమ్మి విషయవాసనలనే బొగ్గులు కొనినట్లవుతుంది. మానవత్వం విలువ తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. జీవితపరమావధి ఒకటి, జీవిత ప్రయత్నం మరొకటి. ఇదా మన మానవత్వం. ఎందుకు పుట్టినామో తెలుసుకోవాలి. ఈనాటి విద్యార్థులు దీనిని తెలుసుకోటం లేదు. జీవితమంటే పుట్టటం, తిరగటం, నిద్రపోవటం, మరణించటంగా భావిస్తున్నారు. దీనిని జీవితంలో enjoy అని పిలుస్తున్నారు. ఇది బలహీన జీవితం. దీని ప్రతి reaction, resound, reflection నీవు భావిలో అనుభవిస్తావు. అంత్యములో శాంతముగా ఉండేదే end-joy అదే enjoy. ఈనాడు విషయభోగాలు అనుభవించిన అంత్యములో నీకు కష్టమే. కనుక, జీవిత పరమావధి అయిన తత్త్వాన్ని తెలుసుకోటానికి ప్రయత్నించాలి. మనలో ఉన్న దివ్యత్వాన్ని అర్థం చేసుకోటమే పరమావధి. జీవితం విత్తనం. మొక్క, చెట్టు, వృక్షంగా ఉన్నట్లుగా పుట్టి, పెరిగి, పరిణామం చెందాలి. కనుక, ఇట్టి చిన్న మొక్కలను వృక్షంగా తీర్చిదిద్దేవారే గురువులు. విద్య ఆచరణలో, ప్రవర్తనలో నిరూపిస్తూరావాలి. కనుక, గురువులు దురభ్యాసములకు, దుశ్చింతలకు గురికాక పిల్లలకు ఆదర్శవంతముగా ఉండాలి. గురువులు చెడుమార్గంలో సంచరిస్తూ శిష్యులకు చెబితే వింటారా? చెప్పటానికికూడా మనసు జంకుతుంది. జీతము నిమిత్తము గురువు కారాదు. జీవితం నిమిత్తం కావాలి. కనుక, గురువులయందున్న సమస్యలు సంప్రదించుకొన్న తరువాత ఆ ఆదర్శ పద్ధతులు అవలంబించి, ఆచరించి పిల్లలకు మార్గదర్శకులు కావాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.